నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: మరమ్మతుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్మన్‌ఘాట్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సాయిరాంనగర్, గ్రీన్‌పార్క్, కర్మన్‌ఘాట్, శ్రీరాం నగర్, చంపాపేట ప్రధాన రహదారి ప్రాంతం, రాఘవేంద్ర, ప్రెస్, నిర్మలానగర్ కాలనీలు. అదేవిధంగా లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కృష్ణానగర్, వినయ్‌నగర్, ఎస్ఎస్ఆర్, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, చంపాపేట, శ్రీనివాసానగర్, బాలాజీనగర్, గాయత్రీనగర్, క్రాంతినగర్, మైత్రిపురం కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో..

సైదాబాద్: మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 10:30 వరకు ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్, ఏసీపీ ఆఫీస్, సైదాబాద్ మెయిన్‌రోడ్, అమీన్ కాలనీ,, జాకీర్ హుస్సేన్ కాలనీ, క్యాపిటల్ హోటల్, ఆస్మాన్‌ఘడ్, సేఫ్ హాస్పిటల్, బీకే ఫంక్షన్‌హాల్ బ్యాక్ సైడ్, ఆంధ్రా బ్యాంక్ కాలనీ పరిసర ప్రాంతాలు.

నేడు ఎల్‌బీనగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

మన్సూరాబాద్: డా.బీఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఎల్‌బీనగర్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శనివారం జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ ఆడాల రమేశ్, కొంగరి నర్సింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కాంగ్రెస్ నేత ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ సంఘాల నేతలు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు.. టమటా రూ.11, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 8, క్యారెట్ 17, దొండ 28, ఆలుగడ్డ 24, ఉల్లిగడ్డ 24, గోకరకాయ 28, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, చిక్కుడుకాయ 55, చామగడ్డ 40, మునగ 23, కందగడ్డ 75, బీట్‌రూట్ 19, కీర 23, బీన్స్ 65, క్యాప్సికమ్ 40. ఈ ధరలు నేటి ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మలక్‌పేట: పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల 55 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు రూ. 22,91,500 ఆర్థిక సాయం మంజూరైందన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఆలయాల కమిటీ చైర్మన్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

హస్తినాపురం: పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ సూచించారు. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలయ కమిటీల చైర్మన్లతో పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆలయ కమిటీలపై ఉందన్నారు. పండుగ సందర్భంగా ఊరేగింపులు చేసే వారు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని డీజేలకు అనుమతులు లేవన్నారు. సమావేశంలో ఎస్ఐ గిరీశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్: కాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని హరిపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెద్ది శ్రీనివాసులు గుప్తా శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంతి ఫౌండేషన్ అధ్యక్షుడు కందుకూరి రాము, ప్రధాన కార్యదర్శి కందుకూరి పద్మతో పాటు సందీప్ గుప్తా, విశ్వప్రసాద్ యాదవ్, బబ్లు యాదవ్ పాల్గొన్నారు.

నియామకం

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆర్కేపురం డివిజన్ సిరినగర్ కాలనీకి చెందిన మునుకుంట్ల బాలకృష్ణ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకపోతుల నరసన్న, జనరల్ సెక్రటరీ పగడాల రంగారావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

బీఎన్‌రెడ్డినగర్‌లోని డీపీఎస్ స్కూల్ నుంచి సిద్ధార్థ స్కూల్‌కు వెళ్లే రోడ్డు కోతకు గురైన దృశ్యం



అంతర్గత రోడ్లు.. అధ్వానం..!

- గుంతలమయంగా కాలనీ రహదారులు
- నెలలుగా మరమ్మతులు శూన్యం
- రాకపోకలకు కాలనీవాసుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నాగోల్: నియోజకవర్గంలోని పలు అంతర్గత రోడ్లు కోతకు గురై అధ్వానంగా మారి గుంతలమయంగా మారాయి. సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులు సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు.

నెలలుగా మరమ్మతులు లేవు..

కాలనీల్లోని అంతర్గత రహదారులు పూర్తిగా ధ్వంసమై నెలలు గడుస్తున్నా..కనీసం ప్యాచ్ వర్కులు కూడా చేపట్టడం లేదని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాలనీల్లోని రోడ్లపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోతకు గురైన రోడ్లు..

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని డీపీఎస్ స్కూల్ నుంచి సిద్ధార్థ స్కూల్ వరకు ఉన్న రోడ్డు గుంతలుగా మారాయి.

- మీసేవా కేంద్రానికి వెళ్లే రహదారి కూడా కోతకు గురై గుంతలుగా తయారైంది.
- నాగోలు డివిజన్‌లోని పలు కాలనీల్లోని రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు రోడ్ల పైకి రావాలంటేనే జంకుతున్నారు.



మల్లికార్జున నగర్ కాలనీలో రోడ్డు పరిస్థితి..

- హస్తినాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా ఉన్న ఇంజినీరింగ్ అధికారులు దృష్టి పెట్టడం లేదని పలువురు మండిపడుతున్నారు.
- మల్లికార్జున నగర్‌లో రోడ్డు పూర్తిగా గుంతలుగా మారింది.



నాగోల్‌లో గుంతలమయంగా రోడ్డు..

అధికారులు పట్టించుకోవడం లేదు..



కాలనీలోని రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. దీంతో పలువురు వాహనదారులు కింద పడి గాయపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– గౌరి, అయ్యప్పకాలనీ

త్వరలోనే మరమ్మతులు..

బడ్జెట్ లేకపోవడం వల్లే అంతర్గత రోడ్ల పనుల్లో జాప్యం జరుగుతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే దెబ్బతిన్న అన్ని రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడుతాం.

– రమేశ్‌బాబు, ఎల్‌బీనగర్ సర్కిల్–3 ఈఈ

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి అధికారులతో కలిసి శుక్రవారం డివిజన్‌లో పర్యటించారు. గురువారం కురిసిన అకాల వర్షానికి రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలు, బురద, మట్టికుప్పలు తొలగింపును పర్యవేక్షించారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈ శరత్‌రెడ్డి, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, సూపర్‌వైజర్ సుభాష్, కాలనీ వాసులు ఉన్నారు.

సైదాబాద్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్: ఏపీఏయూ కాలనీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. కాలనీలో వరద ముప్పు శాశ్వత పరిష్కారానికి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



బురద, మట్టికుప్పలు తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



వరద ప్రభావ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

నాగోలు: భారీగా కురిసిన వర్షాలకు కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల్లోని రోడ్లపై మట్టి పేరుకుపోయిందని వెంటనే మరమ్మతులు చేయించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో బాక్స్ డ్రైనేజ్ లైన్ పనులకు రూ. 3 కోట్లు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. స్పందించి కమిషనర్ మంగళవారం డివిజన్‌లో పర్యటించి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారని ఆయన తెలిపారు.



జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

శోభాయాత్రను జయప్రదం చేయండి

మన్సూరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి జడ్జెస్‌కాలనీలోని శివాలయం గోశాల నుంచి బాలాపూర్‌లోని స్వయంభు హనుమాన్ దేవస్థానం వరకు నిర్వహించే శోభాయాత్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని శివాలయ గోశాల కమిటీ సభ్యులు వినోద్‌కుమార్, గోవింద్‌రెడ్డి, వెంకటేశం, గోపినాథ్ పిలుపునిచ్చారు. శివాలయం వద్ద ర్యాలీ కరపత్రాన్ని గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభవుతుందని పేర్కొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శివాలయ గోశాల కమిటీ సభ్యులు

పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెండింగ్‌లో ఉన్న రూ.218 కోట్ల ట్రైకార్ రుణాలను వెంటనే ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరామ్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రకవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ.... రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించటం వల్ల ట్రైకార్ సంస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజన యువతి, యువకుల నుంచి వేలాది దరఖాస్తులను స్వీకరించి అందులో 30వేల మందికి రుణాలను మంజూరు చేస్తూ లబ్ధిదారులను గుర్తించిందని అన్నారు. అయితే వీరి ఖాతాలలో జామ చేయడానికి రూ.218కోట్ల చెక్కులను సిద్ధం చేసి ఆర్థికశాఖకు పంపించిందన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్
హ్యాండీక్రాఫ్ట్ మేళాను ఆదరించండి

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాను ఆదరించాలని నిర్వాహకుడు అక్బర్‌అలీ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, చెప్పులు తదితర ఉత్పత్తులు తక్కువ ధరలకే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



మేళాలో ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న మహిళలు

శ్రీరామనవమి వేడుకలకు రండి



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ లావణ్య, అర్చకులు

చంపాపేట: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ఈఓ లావణ్య ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని శుక్రవారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు సుధీర్‌రెడ్డిని వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు అందచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటయ్య, అర్చకులు అంబ ప్రసాద్, ప్రవీణ్‌శర్మ, సంతోష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిటైర్డు కార్మికుల ధర్నా

హయత్‌నగర్: పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు హయత్‌నగర్ బస్ డిపో ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు కనీసం రూ. 9 వేల పెన్షన్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని 2017 పే స్కేల్ అమలు చేసి బకాయిలు వెంటనే చెల్లించాలని, 2021 పే స్కేల్‌ను ప్రకటించి ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్య సహాయాన్ని రూ. 10 లక్షల వరకు పెంచాలని, మెడికల్ అటెండెన్స్‌కు సంబంధించి గతంలో ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేఎం రెడ్డి, దానయ్య, పీఎస్ నారాయణ, జయరాం, సామెల్, సారయ్య, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్

చైతన్యపురి: దృష్టి మరల్చి నగదు దోచుకున్న ఓ పాత నేరస్తుడిని చైతన్యపురి పోలీసులు అరెస్టు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నేరెళ్ల వెంకట లక్ష్మీనారాయణ మంగళవారం కారులో వనస్థలిపురం నుంచి ఉప్పల్ వైపు వెళ్తున్నాడు. నాగోలు ఫ్లైఓవర్ సమీపంలో బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి కారును ఆపి తన డబ్బులు ఎందుకు తీసుకెళ్తున్నావని ప్రశ్నించాడు. అతని దృష్టిమరల్చి రూ 8500 నగదు దోచుకెళ్లాడు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిందితుడు బండ్లగూడ మహ్మద్ నగర్‌కు చెందిన పాత నేరస్తుడు మీర్జా అజమ్ బేగ్‌గా (38) గుర్తించారు. శుక్రవారం అజమ్‌బేగ్‌ను అరెస్ట్ చేసి బైక్, రూ. 2 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఐ తెలిపారు.

రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభం

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పేరాల శేఖర్‌జీ, సుభాష్‌చందర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి రానున్న రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. అటల్‌బీహారీ వాజ్‌పేయి ఉత్సవాలు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి కాంగ్రెస్ సమస్యయే కాదని, కాంగ్రెస్‌ను సీఎం రేవంత్‌రెడ్డియే బొంద పెడుతున్నాడని పేర్కొన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో క్రమశిక్షణతో పనిచేస్తే పదవులు వెతుక్కుంటూ వస్తాయని పేర్కొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, రవికుమార్ యాదవ్, జోర్రిగల శ్రీకాంత్, బండారి భాస్కర్, నందికొండ గీతారెడ్డి, శ్యామల, కర్నాటి మాధవి, కవిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

శ్రీరామనవమి ఉత్సవ పోస్టర్ల విడుదల

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ రామాలయంలో ఈనెల 6 నుంచి 21 వరకు సీతారామకల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీరామభక్త సమాజం అధ్యక్షుడు రాజుయాదవ్ పేర్కొన్నారు. రామాలయంలో ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో రోజువారీగా ఉత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌యాదవ్, నిరంజన్ యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్‌యాదవ్, గోపి, యాట ప్రమోద్, నవీన్, పెద్దియాదవర్, రాజ్‌పాల్‌యాదవ్, రాహుల్ కిశోర్ యాదవ్ తదితరులు ఉన్నారు.



ఉత్సవ పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చదువుతోనే సమాజంలో మహిళలకు గౌరవం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

కాచిగూడ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో, సమాజంలో చదువుతోనే మహిళలకు గౌరవం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల అలుమ్నీ సంఘం ఆధ్వర్యంలో 'ఇన్‌స్పిరా–2025' పేరుతో అలుమ్నీ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి నెరెళ్ల శారద ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా విద్య సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అలుమ్నీ సంస్థ కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. సమాజానికి మరింత సేవ చేయాలని ఆమె ఆకాంక్షించారు.

- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి మాట్లాడుతూ.. అలుమ్నీ సంఘం సహకారంతో కళాశాల మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. మహిళా విద్యను పురోగమన మార్గంలో తీసుకెళ్లడానికి కళాశాల యాజమాన్యం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంయుక్త, సుమిత్ర జైస్వాల్, నేహా జైస్వాల్, హరిత, బి.ప్రవళిక, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మధుయాష్కీకి ప్రజల్లో గుర్తింపు లేదు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నిజామాబాద్ నుంచి పారిపోయి ఎల్‌బీనగర్‌కు వచ్చిన మధుయాష్కీ లాంటి టూరిస్టు నాయకులకు ఎల్‌బీనగర్ ప్రజల్లో గుర్తింపు లేదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్‌బీనగర్‌లో మాజీ కార్పొరేటర్లతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన హయాంలో అభివృద్ధి చేసిన పార్కులు, వివిధ అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాలు చేయకుండా మంత్రి పేరిట అడ్డుకోవడం తగదన్నారు. 16 నెలలుగా ఆక్సిజన్ పార్కు ప్రారంభోత్సవం చేయకుండా అడ్డుకుంటున్న ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్‌కు ప్రజలే తగిన బుద్ధి చెపుతారని పేర్కొన్నారు. నియోజక అభివృద్ధికి ఎవ్వరు ఎన్ని నిధులు తెచ్చారో సమాచార హక్కు చట్ట ద్వారా తెలుసుకుని బహిర్గతం చేసేందుకు సిద్ధమా..? అని మధుయాష్కీగౌడ్‌కు ఆయన సవాల్ విసిరారు.

చీకటి ఒప్పందంతోనే ప్రొటోకాల్ రగడ

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందంతోనే అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని దీనికి ప్రధాన కారకుడు మధుయాష్కీగౌడ్ కారణమని సుధీర్‌రెడ్డి ఆరోపించారు. దీనిని సాకుగా తీసుకుని కాలనీలో ప్రొటోకాల్ వివాదంతో గందరగోళం సృష్టిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. చిల్లర రాజకీయాలకు స్వస్తిపలికి అందరం కలిసి పనిచేద్దామని ఆయన హితవు పలికారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, పద్మానాయక్, భవానీప్రవీణ్, కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

